క్లుప్తంగా

ఆర్థిక సహాయం



బాధితురాలికి నగదు అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్ అసోసియేషన్ సభ్యులు

జామి: మండలంలోని విజినిగిరి గ్రామానికి చెందిన కొండమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం అదే గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ సోమవారం రూ.15వేల ఆర్థిక సహాయం అందజేసింది. హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ సభ్యులు టి.సూర్యనారాయణరాజు, బి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ



వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ప్రమీల, తదితరులు

గుర్ల: మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు రాయితీపై వరి విత్తనాలను ఎంపీపీ పొట్నూరు ప్రమీల, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు సోమవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలను, అందిస్తున్న ప్రోత్సాహ కాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, తోట తిరుపతిరావు, టీడీపీ నాయకులు వెన్నె సన్యాసినాయుడు, తిరుమలరాజు కిరణ్‌కుమార్, చనమల్లు మహేశ్వరరావు, సంచాన సన్యాసినాయుడు, మండల అప్పలనాయుడు పాల్గొన్నారు.

నేత్ర వైద్యశిబిరం



నేత్ర పరీక్షలు చేస్తున్న పుష్పగిరి కంటి ఆస్పత్రి సిబ్బంది

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని వెదుళ్లవలస గ్రామంలో ఇండియన్ రెడ్‌క్రాస్, మానవీయతా సంస్థ ఆధ్వర్యం లో సోమవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి సిబ్బంది వెదుళ్లవల స, ఆవగూడెం పరిసర గ్రామాలకు చెందిన 52 మంది నేత్ర పరీక్షలు చేసి 18 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. అవసరమై న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలు



వేపాడ తహసీల్దార్ కార్యాలయం రోడ్డులో విద్యుత్ స్తంభాలు వేస్తున్న సిబ్బంది

వేపాడ: మండల కేంద్రంలో శనివారం వీచిన ఈదురు గాలులకు పలుచోట్ల విద్యుత్ స్తంభాలు కూలిపో వడం, విద్యుత్ తీగలపై చెట్లకొమ్మలు విరిగిపడడంతో పలు వీధులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆదివారం సాయంత్రానికి వేపా డ ప్రధాన రహదారిలో విద్యుత్ సరఫరాను విద్యుత్ శాఖ సిబ్బంది పున రుద్ధరించారు. రెడ్డివీధి, తహసీల్దార్ కార్యాలయం రోడ్డు, శానాపతి వారి గృహాల వద్ద పడిపోయిన స్తంభా లను సోమవారం సరిచేసి సాయంత్రం విద్యుత్ సరఫరా చేశారు.

ఆర్వోబీ వద్ద గోతులు పూడ్చివేత



రైల్వే గేట్ వద్ద వద్ద గోతులు పూడ్చి వేయిస్తున్న పోలీస్‌లు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురంలో నిర్మాణంలో ఉన్న ఆర్వోబీ రైల్వే గేట్ వద్ద ఉన్న గోతులను పెదమా నాపురం ఎస్‌ఐ శిరీష ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం పూడ్చి వేశారు. ఆర్వోబీ నిర్మాణం వద్ద రోడ్డు గోతులు తేలడంతో భారీ వాహనాలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా మారింది. దీంతో పోలీసులు గోతులు పూడ్చి వేయించారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



వేపాడ: బానాది శివాలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం జరిపిస్తున్న గ్రామపెద్దలు



శృంగవరపుకోట: శంబలనగరిలో గాయత్రీమాతకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి, తదితరులు



వేపాడ: శివలింగానికి అభిషేకాలు చేస్తున్న అర్చకుడు

వేపాడ: బానాది గ్రామంలో శివాలయం వార్షికోత్సవం సందర్భంగా శివపార్వతుల కల్యాణం సోమవారం ఘనంగా నిర్వ హించారు. అర్చకులు మేడపాటి కిశోర్‌శర్మ బృందం ఉదయం శివలింగానికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం గ్రామ పెద్దలు, కమిటీ సభ్యుల నేతృత్వంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. పలుసాంస్కతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

గాయత్రీదేవి జయంతి ఉత్సవాలు

శృంగవరపుకోట: మండలంలోని రాజీపేట గ్రామంలోని శంబలనగరి ఆశ్రమంలో సోమవారం గాయత్రీమాత జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ముందుగా గాయత్రీమాతకు ప్రత్యేక అర్చనలు, పూజాధికాలు నిర్వ హించారు. కార్యక్రమానికి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమసాగరరావు, ఆయన భార్య సురేఖ, స్థానిక ఎమ్మెల్యే లలితకుమారి ప్రత్యేక అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈసంద ర్భంగా ఆశ్రమంలో 1,000 మంది మహిళలకు జాకెట్టు ముక్కలు, గాజులు, పసుపు, కుంకుమ అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆశ్రమంలో సత్యసాయి ట్రస్టు, మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి నేతృత్వంలో క్యాన్సర్ స్కీనింగ్ పరీక్షలు, గర్భకోశ, సాధారణ, దంత వైద్య చికిత్స శిబిరం నిర్వహించారు. 200 మంది రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

త్రిపురాంతక స్వామి కల్యాణం



జామి: మూడుకోవెళ్ల ఆలయంలో రాజరాజేశ్వరి, త్రిపురాంతకస్వామి కల్యాణం

జామి: స్థానిక మూడుకోవెళ్ల ఆలయ ప్రాంగణంలో స్వర్ణాకర్ష రాజరాజేశ్వరీ త్రిపురాంతకస్వామి కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. జ్యేష్ఠశుద్ధ ఏకాదశి సందర్భంగా ఆలయ ప్రధా న అర్చకులు విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణ వేడుకను తిలకించారు.

ఘనంగా బక్రీద్ వేడుకలు



లక్కవరపుకోట: ఎల్.కోట మసీద్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



గంట్యాడ: గంట్యాడ మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

లక్కవరపుకోట/కొత్తవలస: బక్రీద్ వేడుకలను కొత్తవలస,లక్కవరపుకోట మండలాల్లో ముస్లింలు సోమవారం ఘనంగా నిర్వహించారు. లక్కవరపుకోట, నర్సంపేట, కొత్తపాలెం తదితర గ్రామాల్లోని మసీదు ల్లో హిమామ్‌ల ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. త్యాగానికి ప్రతీకగా జరుపుకునే పండగ బక్రీద్ అని హిమామ్‌లు తెలిపారు.

ప్రత్యేక ప్రార్థనలు

గంట్యాడ: బక్రీద్ సందర్భంగా మసీదుల్లో ముస్లింలు సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని గంట్యాడ, రామవరం మసీదులకు పెద్ద సంఖ్యలో ముస్లింలు తరలివచ్చి ప్రార్థనలు చేశారు.

ఎస్.కోట పట్టణంలో..

శృంగవరపుకోట: పట్టణంలో బక్రీద్ వేడుకలను ముస్లింలు సోమవారం సంప్రదాయబద్ధంగా నిర్వహించుకున్నారు. ఉదయం నుంచి వర్షం కురవడంతో ఈద్గా వద్దకు వెళ్లే అవకాశం లేక స్థానిక ముస్లిం వీధిలో ఉన్న దర్గాలో సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ వేడుకల్లో పాలుపంచుకున్నారు. ముస్లింలు అంతా తమ ఇళ్ల వద్ద బంధువులు, సన్నిహితులకు విందు ఏర్పా టు చేశారు.

పేదలకు సహాయం చేయడంలోనే సంతృప్తి



పేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న మారుతీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు చంద్రశేఖర్, తదితరులు

గంట్యాడ: పేదలకు సహాయం చేయడంలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని విజయనగరానికి చెందిన మారుతీ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గుత్తురు చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని రావివలస గ్రామంలో 50 మంది పేదలకు బియ్యం , గోదుమ నూక, తదితర నిత్యావసర సరుకులు సోమవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు పట్టెడు అన్నం పెట్టాలనే ఉద్దేశంతో గత 15 ఏళ్లుగా తమ సంస్థ ద్వారా పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవరుచుకోవాలన్నారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ఆశ్రమాల్లో చేర్చవద్దని, వారిని ప్రేమగా చూసుకోవాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు నాగరాజు, తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగంచెల విధానం రద్దు చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాబూరావు

చీపురుపల్లి: పంచాయతీరాజ్ వ్యవస్థల్లో ప్రస్తుతం ఉన్న నాలుగంచెల విధానం రద్దు చేసి మూడంచెల విధానం అమల్లోకి తీసుకురా వాలని మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు అన్నారు. సోమవారం ఆయన తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న నాలుగంచెల వ్యవస్థ విధానంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ వ్యవస్థ ఉత్సవ విగ్రహాలు మాదిరిగా ఉండాల్సి వస్తోంది తప్ప ఎలాంటి ప్రయోజనం కనిపించడం లేదన్నారు. అందుకే మూడంచెల వ్యవస్థ విధానంలో సర్పంచ్, ఎంపీపీ, జిల్లా పరిషత్ చైర్మన్‌కు నేరుగా ప్రజలే ఓటు వేసి ఎన్నుకునే విధానం తీసుకురావాలన్నారు. అప్పుడే గ్రామాల అభివృద్ధి కోసం కేటాయించే నిధులు పక్కదోవ పట్టకుండా సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎలాంటి కక్ష సాధింపు ధోరణిలు, అహంకారం చూపకుండా పాలన చేయాలని సూచించారు. అలా కాకుండా కక్షధోరణి అవలంబిస్తే వచ్చే ఎన్నికల్లో నిరాశ తప్పదని స్పష్టం చేశారు. జనసేన జిల్లా కో–ఆర్డినేటర్ కోట్ల కృష్ణ పాల్గొన్నారు.

జిందాల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మంత్రి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న జిందాల్ కర్మాగారం కార్మికులు

లక్కవరపుకోట: ఎస్.కోట నియోజకవర్గంలోని సమస్యలతో పాటు జిందాల కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఇంటికి సోమవారం ఆయన వచ్చారు. గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు, ఎస్.కోట సమీపంలో జిందాల్ పరిశ్రమ ఏర్పాటుకు స్థల సేకరణ, పతంజలి భూములు, ఎస్.కోట నియోజకవర్గాన్ని విశాఖపట్నం జిల్లాలో విలీనం తదితర అంశాలను మంత్రికి స్థానిక ఎమ్మెల్యే వివరించారు. అనంతరం కొత్తవలస మండలంలోని జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్ కర్మాగారం తెరిపించి తక్షణమే ఉపాధి కల్పించాలని కోరుతూ కార్మికులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న 3, 4, 5 తరగతి విద్యార్థులను సమీప హైస్కూల్‌లో విలీనం చేస్తూ గతంలో ఇచ్చిన 117 జీఓను రద్దు చేయాలని పలువురు ఉపాధ్యాయులు వినతిపత్రాన్ని అందజేశారు. వీటిపై మంత్రి స్పందిస్తూ మంత్రి మండలిలో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోళ్ల రామ్‌ప్రసాద్, కొల్లి రమణమూర్తి, కరెడ్ల ఈశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రాయితీపై విత్తనాల పంపిణీ
- ఎంఎస్ఎంఈ మంత్రి శ్రీనివాస్



రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీనివాస్

గజపతినగరం రూరల్: అర్హత ఉన్న ప్రతి రైతుకు రాయితీపై విత్తనాలను అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని, రైతు సంక్షేమాన్ని శత శాతం నిర్వహించడమే లక్ష్యమని ఎంఎస్ఎంఈ, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన గజపతినగరం నియోజకవర్గ కేంద్రంలోని మార్కెట్ యార్డులో రైతులకు రాయితీపై విత్తనాలను పంపిణీచేశారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మాట్లాడుతూ విత్తనాలకోసం రైతులకు ఎటువంటి ఇబ్బంది రాకుండా చూసుకునే బాధ్యత తనపై ఉందన్నారు. అర్హత ఉన్న ప్రతి రైతుకు విత్తనాలు అందించేలా దృష్టి సారించాలని అధికారులను కోరారు. విత్తనాలతో పాటు, ఎరువులు, యూరియాకూడా సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో, వాతావరణం అనుకూలంగా ఉందని రైతులకు పంట దిగుబడి పెరిగి ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖాధికారి వి.టి.రామారావు, ఏడీఏ మహారాజన్, బొబ్బిలి ఆర్డీఓ ఎ.సాయిశ్రీ, విజయనగరం ఏడీఏ నాగభూషణం, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, మాజీ జెడ్పీటీసీ మక్కువ శ్రీధర్, పీవీవీ గోపాలరాజుతో పాటు నాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు

సామూహిక సత్యనారాయణ వ్రతాలు



సత్యనారాయణ స్వామి వ్రతాలు జరిపించుకుంటున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొత్తపేట సత్యనారాయణస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు సోమవారం వైభవంగా జరిగాయి. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ పురోహితులు వేకువ జాము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల పంచామృతాలతో అభిషేకాలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి సన్నిధిలో వ్రతాలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వరి నారు పోసేందుకు సిద్ధం



కాలంరాజుపేటలో వరి నారుపోసేందుకు సిద్ధం చేసిన పొలం

గజపతినగరం: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి నారుమడులు సిద్ధం చేసే పనిలో మండల రైతులు నిమగ్నమ య్యారు. అడపాదడపా ఇటీవల వర్షాలు కురవడంతో నారుపోసేందుకు ఎంపిక చేసుకున్న మడులను రైతులు దుక్కి దున్ని సదును చేశారు. మరో మారు దుక్కులు చేసి వరి విత్తనాలు పోసేందుకు శ్రీరంగరాజపురం,గంగబోళ్ల పెంట, కాలంరాజుపేట, కొనిశ, చిట్టాయవలస,కొత్తబగ్గాం తదితర గ్రామాల రైతులు సమాయత్తమవుతున్నారు.

బడి సంచి.. మోయలేనంత!

- అమలుకాని ఎన్‌సీఆర్ఈటీ సూచనలు
- విద్యార్థులకు తప్పని పుస్తకాల భారం



మోయలేని పుస్తకాల బ్యాగుతో చిన్నారులు

విజయనగరం: పుస్తకాల సంచి బాలలకు శాపంగా మారుతోంది. మోయలేని భారంతో చిన్నారులు అనారోగ్యానికి గురవుతున్నారన్నది వైద్యుల మాట. ఈ పరిస్థితిని నివారించాలని ఎన్‌సీఆర్‌టీ చేసిన సూచనలు ఎక్కడా అమలుకావడం లేదు. ఏటా పుస్తకాల సంచి బరువు పెరగడమే తప్ప తగ్గం కనిపించడం లేదు. విద్యార్థి తన శరీర బరువులో రెండో వంతు మోయడం అనారోగ్య సమస్యలను తెచ్చి పెడుతోంది. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో పుస్తకాల సంచి పరిమాణాన్ని తగ్గిస్తూ రాష్ట్రాలకు కేంద్రం సూచనలు చేసింది. నెలలో మొదటి, మూడో శనివారం నో బ్యాగ్ డేగా నిర్వహించాలన్న ఆదేశాలున్నా ఆచరణలో కనిపించడం లేదు.

ఇదీ ఎన్‌సీఆర్ఈటీ పరిశీలన

సంచి బరువుపై జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎన్‌సీఆర్ఈటీ) నిర్వహించిన సర్వేలో నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను పరిశీలించారు. సాధారణంగా వీరి శరీర బరువు 18 కేజీల నుంచి 22 కేజీల వరకు ఉంటుంది. ప్రభుత్వ బడుల్లో 10 నుంచి 12 కేజీలు, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 14 నుంచి 18 కేజీలు పుస్తకాల మోత ఉంటుంది. 8 నుంచి పదో తరగతి విద్యార్థుల శరీర బరువు 40 నుంచి 50 కేజీల వరకు ఉంటే వారు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా భావించాలి. వారు బడికి వెళ్లేందుకు 20 నుంచి 25 కేజీల సంచిని మోయాల్సి వస్తోంది. పాఠ్యపుస్తకాలకు తోడు క్యారేజీ, తాగు నీటి సీసా తదితరాలు అదనం. ప్రభుత్వ బడుల కన్నా ప్రైవేట్లో మోత ఎక్కువగా ఉంటుందని శిక్షణ మండలి పేర్కొంది. రాష్ట్ర సిలబస్ తోపాటు పాఠశాలలు ప్రత్యేకంగా రూపొందించిన సిలబస్, ఐఐటీ, సీబీఎస్ఈ ఇలా వివిధ రకాల పుస్తకాలను మోయాల్సి రావడం విద్యార్థులకు తీవ్ర ఇబ్బందిగా మారుతోంది.

తగ్గని బరువు...

వాస్తవానికి ఒకటి, రెండు తరగతులకు రెండు పుస్తకాలు (లాంగ్వేజెస్, గణితం, ఎన్విరాన్మెంట్) ఉండాలి. సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తోంది. ఒకటి, రెండు తరగతులకు ఎనిమిది పుస్తకాలు, తరగతి పెరిగే కొద్దీ అధిక పాఠ్యపుస్తకాలను మోయాల్సి వస్తోంది. దీంతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు భారం తప్పకపోగా... ఇక ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల విద్యార్థుల పరిస్థితి చెప్పనక్కర్లేదు.

ఆరోగ్య సమస్యలివే...

విద్యార్థులు తమ స్థాయికి మించి బరువు మోస్తుండడంతో పలురకాల ఆరోగ్య సమస్యల బారిన పడే అవకాశం ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వెన్ను, కండరాల నొప్పులకు దారి తీస్తుందని పేర్కొంటున్నారు. శారీరక, మానసిక సమస్యలు ఏర్పడవచ్చంటున్నారు. చదువుపై ఏకాగ్రత తగ్గుతుందని హెచ్చరిస్తున్నారు. సృజనాత్మకత దెబ్బతినడమే కాకుండా తద్వారా విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతారని పేర్కొంటున్నారు.

అవసరమైన మేరకు తీసుకెళ్లాలి

ఒత్తిడి లేని బోధన విద్యార్థులకు అవసరమని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తించాలి. విద్యార్థులు మోయలేని స్థాయిలో పుస్తకాల బ్యాగు ఉండకూడదు. అవసరమైన వాటిని తీసుకెళ్లడం చేయాలి. తద్వారా విద్యార్థుల మానసిక, శారీరక శ్రమ తగ్గుతుంది. చదువులో చురుగ్గా ఉంటారు. పరిమితికి మించి బరువు మోయడంతో ప్రశాంతత కోల్పోయి చేసే పనిపై దృష్టి సారించలేరు.

– ఎం. శ్రీనివాసరావు, చిన్న పిల్లల వైద్య నిపుణుడు

ఎండా.. వాన



వెదురువాడలో కురుస్తున్న వర్షం

బొండపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం భిన్న వాతావరణం నెలకొంది. వెదురువాడ, కొవ్వాడపేట, మరువాడ, కొత్తపాలెం తదితర గ్రామాల్లో వేకువ జామున ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులుతో సుమారు గంటన్నర పాటు వర్షం కురిసింది. వాతావరణం ఒక్కసారిగా తుఫాన్‌ను తలపించింది. 10 గంటలు దాటిన తర్వాత మండు వేసవిని తలపించేలా ఎండ తీవ్రత పెరగడంతో అంతవరకు చల్లబడ్డ వాతావరణంతో సేదతీరిన ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అయ్యారు.

ముగ్గురికి కత్తిపోట్లు

విజయనగరం క్రైమ్: మద్యం దుకాణం వద్ద మందుబాబుల రగడతో ముగ్గురు కత్తిపోట్లకు గురయ్యారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. పూల్‌బాగ్‌కు చెందిన సతీష్, పృథ్వీ, హరీష్‌లు మద్యం కొనుగోలు చేయడానికి దుకాణం వద్దకు వచ్చారు. ఆ సమయంలో అదే ప్రాంతానికి చెందిన అసీద్దీన్, నారాయణలు కూడా వచ్చారు. మద్యం కొనుగోలు చేసేందుకు క్యూలో నిలబడిన సతీష్, అసీద్దీన్ మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఆగ్రహానికి గురైన అసీద్దీన్ తన దగ్గర ఉన్న కత్తితో సతీష్ పొట్టపై రెండు పోట్లు పొడిచాడు. పట్టుకోవడానికి వెళ్లిన హరీష్, పృథ్వీలపై కూడా కత్తితో దాడి చేసి పరారయ్యాడు. స్థానికులు స్పందించి గాయాలైన ముగ్గురిని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ఈ మేరకు టుటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం మధ్యాహ్నం అయ్యప్పనగర్ వద్ద అసీద్దీన్‌తో పాటు సహకరించిన నారాయణను అదుపులోకి తీసుకున్నారు.